సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం : 29 : జనవరి : 2025



.. నైపుణ్యం వెలికితీయాలి

ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థుల్లోని నైపుణ్యాలు వెలికితీయాలని ఐటీడీఏ పీఓ రాహుల్ సూచించారు. 8లో



.. హామీలు నెరవేర్చండి

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు విమర్శించారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 33° / 18°

జిల్లాలో బుధవారం ఉదయం మొదలయ్యే ఎండ మధ్యాహ్నానికి తీవ్రమవుతుంది. రాత్రికి చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి మంగళవారం శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోప వీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు వైభవంగా జరిపించారు. మంగళవారాన్ని పురస్కరించుకొని అభయాం జనేయ స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు గావించారు.

రామయ్యకు రూ.5లక్షల విలువైన ఆభరణాలు

శ్రీ సీతారామ చంద్రస్వామికి హైదరాబాద్ వాస్తవ్యులు సుదర్శన్‌రెడ్డి – అరుంధతి రూ.5ల క్షల విలువైన కాసుల పేరు, పచ్చరాయితో ఉన్న గొలుసును మంగళవారం బహూకరిం చారు. అలాగే, ఏపీలోని సింహాచలం వాస్తవ్యు లు రాంకుమార్ రూ.1.18లక్షల విలువ చేసే 11గ్రాములతో చేయించిన నాలుగు బంగారు గాజులను ఆలయ అధికారులకు అందజేశారు.

సింగరేణిలో 15 మంది సర్వే అధికారుల బదిలీ



సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలోని వివిధ ఏరియాల్లో విధులు నిర్వహిస్తున్న 15 మంది సర్వే అధికారులను బదిలీ చేస్తూ యాజమాన్యం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో ఏడుగురు సూపరింటెండెంట్ సర్వే అధికారులు, ఐదు గురు డిప్యూటీ ఎస్ఎస్ఓలు, సీనియర్ సర్వే అధికారి ఒకరు, మరో ఇద్దరు జూనియర్ సర్వే అధికారులు ఉన్నారు. వీరంతా ఫిబ్రవరి 7వ తేదీ లోగా వారికి కేటాయించిన ఏరియాల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

బ్యాంకుల వద్ద పటిష్ట భద్రత : ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెంటౌన్: బ్యాంకుల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ రోహిత్ రాజ్ అన్నారు. మంగళవారం ఆయన జిల్లా లోని అన్ని బ్యాంకుల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇటీవల వరంగల్, బీదర్ ప్రాంతాల్లోని బ్యాంకుల్లో చోరీలు జరిగాయని, జిల్లాలో అలాంటి ఘటనలు చోటుచేసుకోకుం డా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచిం చారు. బ్యాంకు లోపల, బయట సీసీ కెమె రాలు, సెక్యూరిటీ సిబ్బందిని అప్రమత్తం చేయాలని చెప్పారు. సైబర్ మోసాలపై వాల్ పోస్టర్లు, కరపత్రాల ద్వారా ప్రజలకు అవ గాహన కల్పించాలన్నారు. సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌సింగ్, బ్యాంక్ అధికారులు, డీఎస్పీలు పాల్గొన్నారు.

కూలీలకు భరోసా



పథకంలో గతేడాది కనీసం 20 రోజులు పని చేయా లనే నిబంధనతో లబ్ధిదారులను ఎంపిక చేశారు.

భూమిలేని పేదలకు సర్కారు సాయం

- జిల్లాలో 32,001 మంది అర్హులు
- మొదట 1,248 మంది ఖాతాల్లో నగదు జమ
- గ్రామసభల్లో కొత్తగా 15,054 దరఖాస్తులు

చుంచుపల్లి : భూమి లేని వ్యవసాయ కూలీలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అమల్లోకి తెచ్చింది. ఈనెల 21 నుంచి 24 వరకు జిల్లా వ్యాప్తంగా గ్రామ సభలు నిర్వహించి లబ్ధిదారుల పేర్లను అధికారులు వెల్లడించారు. అయితే అర్హులందరికీ ఈ పథకం వర్తింపజేయలేదంటూ పలుచోట్ల నిరసనలు వెల్లు వెత్తడంతో తిరిగి కొత్తగా దరఖాస్తులు తీసుకు న్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈనెల 26న పథకాన్ని లాంఛనంగా ప్రారంభించి, మండ లానికి ఒక గ్రామంలో ఎంపికైన లబ్ధిదారులకు మం జూరు పత్రాలు అందజేశారు. ఎంపిక చేసిన గ్రామాలకు చెందిన 1,248 మందికి రూ.6 వేల చొప్పున రూ.74.88 లక్షలు వారి ఖాతాల్లో జమ చేసింది. లబ్ధిదారులకు ఏడాదికి రూ.12 వేలు ఇవ్వ నుండగా ప్రస్తుతం మొదటి విడతలో రూ.6 వేలు అందిస్తున్నారు. మిగితా సగం రెండో విడతలో జమ చేస్తారు. భూమిలేని పేదలు ఉపాధిహామీ పథకంలో గతేడాది కనీసం 20 రోజులు పని చేయా లనే నిబంధనతో లబ్ధిదారులను ఎంపిక చేశారు.

జిల్లాలో 32,001 మంది..

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి అర్హుల జాబితా రూపొందించి.. ఇటీవల నిర్వహించిన గ్రామసభల్లో వీరి పేర్లతో కూడిన జాబితాను వెలువరించారు. అయితే తమకు అర్హత ఉన్నా జాబితాలో పేరు లేదంటూ పలు చోట్ల ఆందోళనలు జరిగాయి. దీంతో అర్హులైన వారు తిరిగి గ్రామ పం చాయతీలు, మండల కార్యాలయాల్లో దరఖాస్తులు అందజేయాలని, ప్రస్తుతం ఎంపికైన వారిలో అన ర్హులున్నట్లు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే పరిశీలించి వారిని తొలగిస్తామని అధికారులు ప్రక టించారు. జిల్లా వ్యాప్తంగా 481 గ్రామ పంచాయ తీల్లో గతేడాది 20 రోజుల పనిదినాలు పూర్తి చేసి, గ్రామ సభలో ఆమోదం పొందిన వారు 32,001 మంది కూలీలు ఉన్నట్లు అధికారులు తేల్చారు. ఇం దులో పాల్వంచ మండలంలో అత్యధికంగా 3,281 మంది ఉండగా, అత్యల్పంగా భద్రాచలం మండ లంలో 111 మంది ఉన్నారు. అన్ని అర్హతలున్నప్ప టికీ అధికారులు ప్రకటించిన జాబితాల్లో తమ పేర్లు లేవని, తమకు కూడా ఈ పథకం కింద సాయం చేయాలని కోరుతూ ఇటీవల నిర్వహించిన గ్రామసభల్లో కొత్తగా 15,054 మంది దరఖాస్తులు చేసుకున్నారు. వీటిపై కూడా పూర్తిస్థాయిలో విచార ణ చేసి అర్హులకు ఈ పథకం వర్తింపజేసేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఆందోళన అవసరం లేదు

రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన నాలుగు సంక్షేమ పథకాలకు అర్హత ఉండి జాబితాల్లో పేర్లు లేని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వారు మళ్లీ దరఖాస్తు చేసుకుంటే పరిశీలిస్తాం. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద ఇప్పటివరకు 1,248 మంది ఖాతాల్లో నగదు జమయింది.

– ఎం.విద్యాచందన, డీఆర్‌డీఓ

మండలాల వారీగా వివరాలిలా..

మండలం	అర్హులు	కొత్త అర్జీలు	మండలం	అర్హులు	కొత్త అర్జీలు
ఆళ్లపల్లి	440	299	గుండాల	233	189
అన్నపురెడ్డిపల్లి	1,752	493	జూలూరుపాడు	771	391
అశ్వాపురం	1,444	666	కరకగూడెం	661	109
అశ్వారావుపేట	1,665	1,045	లక్ష్మీదేవిపల్లి	1,528	771
భద్రాచలం	111	32	మణుగూరు	1,785	529
బూర్గంపాడు	3,163	901	ములకలపల్లి	2,032	1,639
చండ్రుగొండ	1,649	148	పాల్వంచ	3,281	1,016
చర్ల	419	554	పినపాక	1,014	1,070
చుంచుపల్లి	1,533	377	సుజాతనగర్	2,296	1,264
దమ్మపేట	2,034	1,500	టేకులపల్లి	1,478	546
దుమ్ముగూడెం	1,459	857	ఇల్లెందు	1,253	658

హోరెత్తుతున్న ప్రచారం

- ఈనెల 31న ఐటీసీ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు
- ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కార్మిక సంఘాలు
- విందు రాజకీయాలకు రూ.లక్షల్లో ఖర్చు
- సాధారణ ఎన్నికలను మించిన సందడి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న యూనియన్ నాయకులు

బూర్గంపాడు: ఆసియా ఖండంలోనే అతిపెద్ద పేపర్ పరిశ్రమ అయిన సారపాక ఐటీసీ పీఎస్‌పీడీలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల ప్రచారం హోరె త్తుతోంది. ఈనెల 31న జరగనున్న ఎన్నికల్లో గెలుపు కోసం ట్రేడ్ యూనియన్లు హోరాహోరీగా పోరాడుతున్నాయి. బరిలో ఉన్న ట్రేడ్ యూనియన్ల ప్రచార హోరుతో సారపాక, భద్రాచలం, బూర్గం పాడు, నాగినేనిప్రోలు, మోరంపల్లిబంజర, లక్ష్మీ పురం, మోతె, ఇరవెండి ప్రాంతాల్లో సాధారణ ఎన్నికలను మించిన సందడి కనిపిస్తోంది. ఐటీసీ యాజమాన్యంతో 14వ వేతన ఒప్పందం నేపథ్యం లో ఈ ఎన్నికలను అన్ని కార్మిక సంఘాలు ప్రతిష్టా త్మకంగా తీసుకున్నాయి. ఐటీసీ పీఎస్‌పీడీలో పనిచే స్తున్న 1,178 మంది పర్మనెంట్ కార్మికులు, 82 మంది బదిలీ వర్కర్లు మొత్తం 1,260 మంది ఓటు హక్కు కలిగి ఉన్నారు. పరిశ్రమలో పని చేసే సుమారు 9 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులకు, 600 మందికి పైగా మేనేజర్లకు ఓటు హక్కు లేదు. కాగా, 1260 మంది ఓట్ల కోసం బరిలో ఉండే కార్మిక సంఘాలు రూ.కోట్లు ఖర్చు చేస్తున్నాయి. గత నెల పదిహేను రోజులుగా ఎన్నికల ప్రచారం కోసం రూ.లక్షలు వెచ్చించిన ట్రేడ్ యూనియన్లు.. ఎన్నికలకు మూడు రోజులు మాత్రమే గడువు ఉం డడంతో ఓటర్లకు విచ్చలవిడిగా విందులు, తాయి లాలు ఇస్తున్నాయి. ఎన్నికల నేపథ్యంలో కార్మిక సంఘాలు మొత్తంగా రూ. 4 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నాయనే ప్రచారం సాగుతోంది. యూనియ న్లకు మద్దతుగా రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రచారంలో పాల్గొంటున్నారు.

త్రిముఖ పోటీ..!

ఐటీసీలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలను టీఎన్‌టీయూసీ, ఐఎన్‌టీయూసీ, బీఆర్‌టీయూ, బీఎంఎస్, ఏఐటీయూసీ ప్రతిష్టాత్మకంగా తీసుకు న్నాయి. ముఖ్యంగా టీఎన్‌టీయూసీ, ఐఎన్‌టీయూ సీ, బీఆర్‌టీయూ మధ్య త్రిముఖ పోటీ నెల కొన్నట్లు తెలుస్తోంది. ఎవరు గెలిచినా కొద్దిపాటి ఓట్ల మెజారిటీనే అని ప్రచారం సాగుతోంది. దీంతో ఈ మూడు యూనియన్‌లు వ్యూహాలకు పదును పెట్టి గెలుపు కోసం సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా సోషల్ మీడియా లో విమర్శలు, ప్రతి విమర్శలతో ఎన్నికల ప్రచారం సాగుతోంది. ఈ విమర్శలు తీవ్రస్థాయికి చేరుతుం డడంతో గొడవలు జరిగే పరిస్థితులు కనిపిస్తు న్నాయి. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు కార్మిక, పోలీస్ శాఖలతో పాటు ఐటీసీ యాజమా న్యం సంయుక్తంగా ఏర్పాట్లు చేస్తున్నాయి. ఇప్పటికే ట్రేడ్ యూనియన్లు, అనుబంధ రాజకీయ పార్టీల నేతలతో సమావేశాలు నిర్వహిస్తున్నాయి. ఎన్నికల సందర్భంగా ఈనెల 30, 31 తేదీల్లో బూర్గంపాడు, భద్రాచలం ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు చేసే ఆలోచనలో పోలీస్ శాఖ ఉంది.

నగదు.. నజరానా..

నిన్నటి వరకు విందు, మందు రాజకీయాల తో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు భారీగా ఖర్చు చేసిన కార్మిక సంఘాల నాయ కులు ఇప్పుడు ఓటర్లను తమవైపునకు తిప్పు కునేందుకు భారీగా నగదు, నజరానాలకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. గతంలో న్యూట్రల్ గా ఉండే ఓటర్లకే ట్రేడ్ యూనియన్‌లు ఎంతో కొంతో ముట్టజెప్పేవి. ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. రోజూ తమవెంట ఎన్నికల ప్రచారంలో తిరుగుతున్న నాయకులకు, కార్య కర్తలకు కూడా భారీగానే నగదు, నజరానాలు ఇవ్వాల్సి వస్తోంది. లేదంటే ప్రత్యర్థి యూనియన్‌ల నాయకులు రహస్యంగా ఇళ్ల వద్దకు వెళ్లి కుటుంబసభ్యులతో మాట్లాడి పెద్ద మొత్తంలో నగదు ఇచ్చి ప్రమాణాలు చేయిం చుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో ట్రేడ్ యూనియన్ల నాయకులకు ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మొద్దో అర్థం కావడం లేదు. ఈ ఎన్నికలలో ఓటుకు రూ. 20 వేల నుంచి రూ.30 వేల వరకు డిమాండ్ ఉన్నట్లు ప్రచారం సాగుతోంది.

ఆయిల్‌ఫెడ్‌లో అంతర్యుద్ధం !

- అశ్వారావుపేట ఫ్యాక్టరీలో క్రూడ్ కుంభకోణం
- రికవరీ తగ్గించేందుకేనంటూ ప్రచారం
- రేగళ్లపాడు నర్సరీ తప్పిదాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం
- కింది స్థాయి ఉద్యోగులే బలి..



అశ్వారావుపేట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ

అశ్వారావుపేట : ఆయిల్‌ఫెడ్‌లో అంతర్యుద్ధం కొన సాగుతోంది. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం రేగళ్లపాడు నర్సరీలో ఆఫ్‌టైప్ మొక్కల తొలగింపు అంశం వారం రోజులుగా హాట్ టాపిక్‌గా మార గా.. ఆయిల్‌ఫెడ్ అధికారులు దీనికి సంబంధం లేని ఇద్దరు చిరుద్యోగులపై చర్యలు తీసుకుని చేతులు దులుపుకున్నారు. కోస్టారికా నుంచి సీడ్ లింగ్స్ ఎం పిక చేసిన ఉన్నతాధికారులెవరు.. వాటికి అనుమ తిచ్చిందెవరు.. అనే అంశం బయటకు పొక్కకుండా చిరుద్యోగులపై వేటు వేయగా దీనిపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. అయితే ఈ అంశాన్ని మరిపించేం దుకు అధికారులు అశ్వారావుపేట ఫ్యాక్టరీని వేదిక గా చేసుకున్నారు. ఈ ఫ్యాక్టరీ ఆయిల్‌ఫెడ్‌లో కుంభ కోణాలకు పుట్టినిల్లు. ఓ మాటలో చెప్పాలంటే ఆయిల్‌ఫెడ్‌లో కుంభకోణాలపై ఎవరైనా డాక్టరేట్ చేయాలంటే ఇక్కడ జరిగిన ఉదంతాలు మంచి రిఫరెన్స్‌గా పనికొస్తాయి. 2012 – 2014 మధ్య కాలంలో ఇక్కడ జరిగిన కుంభకోణాలను నాడు 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. దీంతో ఓ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ జైలు పాలయ్యారు కూడా.

ఇప్పుడేం జరిగింది..?

అశ్వారావుపేట ఆయిల్‌ఫెడ్ ఫ్యాక్టరీలో జరిగిన గత అక్టోబర్‌లో గానుగాడిన ముడి చమురును ఆనెల స్టాక్‌లో చూపలేదు. అయితే ఈ ఒక్క తేడా ప్రస్తుత ఆయిల్ ఇయర్ (నవంబర్ 2024 – అక్టోబర్ 2025)లో రాష్ట్రంలో సాగయ్యే పామాయిల్ గెలల ధరపై ప్రభావం చూపుతుంది. అక్టోబర్‌లో ఓపెనిం గ్ బ్యాలెన్స్, గానుగాడగా వచ్చిన క్రూడాయిల్‌లో అమ్మగా మిగిలిన స్టాక్‌ను 68.250 టన్నులు తక్కు వగా చూపారు. ఈ స్టాక్‌ను ఆలస్యంగా డిసెంబర్ నెలలో కలిపి రికార్డుల్లోకి ఎక్కించారు. ఏటా ఆయిల్ ఇయర్‌లో వచ్చిన దిగుబడిని బట్టి రానున్న ఏడాదికి గెలల ధరను ఆయిల్‌ఫెడ్ నిర్ణయిస్తుంది. ఈ ధరనే దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రైవేటు కం పెనీలు రైతులకు చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఈ 68.250 టన్నుల కోతతో రైతులు 0.15 శాతం నష్టపోవాల్సి వస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇలా రైతులను నష్టపరిస్తే ఆయిల్‌ఫెడ్‌కు లాభమేం టి అనుకుంటే పొరపాటే. రికవరీ శాతాన్ని తగ్గిం చడం ద్వారా ప్రైవేటు కంపెనీల నుంచి అధికారులు లబ్ధి పొందుతారనే ఆరోపణలు వస్తున్నాయి.

ఎక్కడా లిఖితపూర్వక ఆదేశాల్లేవు..

అక్టోబర్ నెల స్టాక్‌ను దాచి ఉంచిన విషయం లో ఉన్నతాధికారుల నుంచి లిఖిత పూర్వక ఆదే శాలు లేకున్నా మేనేజర్ అలా చేయాల్సి వచ్చిం ది. నిత్యం క్రషింగ్, అమ్మకం, నిల్వ వివరాలను హైదరాబాద్‌లోని హెడ్ ఆఫీస్‌కు రిపోర్టు పంపు తుంటారు. ప్రతి నెలా ఇలా నిల్వలను దాచి ఉంచని అధికారులు.. ఆయిల్ ఇయర్ ముగిం పులోనే ఎందుకు చేశారనేది అనుమానాలకు తావిస్తోంది. ఆయిల్‌ఫెడ్ అనేది ఓ ప్రత్యేక సామ్రాజ్యం కావడంతో ఉన్నతాధికారుల ఆదే శాల మేరకు సిబ్బంది తప్పులు చేయక తప్పద నేది అందరికీ తెలిసిందే. ప్రస్తుత ఘటనలో అశ్వారావుపేట ప్లాంట్ మేనేజర్ పాత్ర కంటే ఉన్నతాధికారుల పాత్రే అధికంగా ఉంటుందని రైతులు అనుమానిస్తున్నారు. ఈ విషయాలపై ఆయిల్‌ఫెడ్ జీఎం సుధాకర్ రెడ్డిని వివరణ కోరేందుకు పలుమార్లు ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

ఎడ్ల బండ్లతో ఎమ్మెల్యే ప్రదర్శన



ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య తదితరులు

సీఎం చిత్రపటానికి కోరం క్షీరాభిషేకం

ఇల్లెందు: రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలతో రాష్ట్ర ప్రభుత్వం రైతులు, వ్యవ సాయ కూలీల కుటుంబాల్లో వెలుగులు నింపిందని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. రెండు రోజులుగా ఈ నిధులు లబ్ధిదారుల ఖాతాల్లో జమ వుతున్న నేపథ్యంలో మంగళవారం ఆయన ఇల్లెం దులో ఎడ్లబండ్లు, ట్రాక్టర్లతో ప్రదర్శన నిర్వహిం చారు. అనంతరం స్థానిక బగదాంబా సెంటర్‌లో సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపడు తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మొదటి విడతలో తమకు లబ్ధి జరగలేదని ఎవరూ ఆందోళన చెందొద్దని, అర్హు లైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు తీసుకె ళ్లాలని కార్యకర్తలకు సూచించారు. పథకాల అమ లులో అర్హులైన పేదలకు అన్యాయం జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రాంబాబు, మాజీ ఎంపీపీ మోకాళ్ల వెంకటమ్మ, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు డానియేల్, పులి సైదులు, మున్సిపల్ మాజీ చైర్‌ప ర్సన్ యదల్లపల్లి అనసూర్య, ముక్తి కృష్ణ, తాటి భిక్షం, ఎట్టి హరికృష్ణ, ఆరెం కిరణ్, మండల రాము, భార్గవ్, గూడ బాబూరావు, కల్తీ పద్మ, సాయం స్వాతి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలు కాంగ్రెస్‌కే సాధ్యం..

టేకులపల్లి: ఇచ్చిన హామీలను అమలు చేసే సత్తా కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మంగళవారం ఆయన స్థానిక క్యాంప్ కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. రైతులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్ర మంలో నాయకులు కోరం సురేందర్, భూక్య దేవా, ఇస్లావత్ రెడ్యానాయక్, ఈది గణేష్, చందర్సింగ్, పోశాలు, సర్దార్, బానోత్ రవి, భద్రు, ఈశ్వర్, గణే ష్, మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే గౌరవం, గుర్తింపు

ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్



సారపాకలో మాట్లాడుతున్న కోదండరామ్

భద్రాచలంటౌన్ : సరైన చదువు ఉంటేనే సమాజం లో గౌరవం, గుర్తింపు దక్కుతాయని టీజేఎస్ వ్యవ స్థాపకులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. భద్రాచలంలోని గిరిజన బీఈడీ కళాశా లను మంగళవారం ఆయన సందర్శించి విద్యార్థుల తో మాట్లాడారు. గిరిజన బిడ్డలు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాం క్షించారు. దేశంలోనే ఏకైక గిరిజన బీఈడీ కళాశాల భద్రాచలంలో ఉండడం హర్షణీయమని అన్నారు. ప్రస్తుతం అమెరికాలో ఉన్న ఏడు లక్షల మంది భారతీయులను వెనక్కు పంపేందుకు అక్కడి ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందని, తద్వారా ఆ దేశ యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందించేలా చూస్తోందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వీరూనాయక్, అధ్యాపకులు నవీన్, కిషోర్, టీజేఎస్ నాయకులు తిప్పన సిద్ధులు, రేపాక రామారావు గుప్తా, పూనెం ప్రదీప్ కుమార్, బి.దేవదానం, నాగిరెడ్డి, కరుణాకర్ రెడ్డి, నబి సాహెబ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణకు కృషి

బూర్గంపాడు : సారపాక నుంచి ఏటూరునాగారం వరకు గల రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగు తున్నందున వాటి నివారణకు ఈ రోడ్డును నాలుగు లేన్లుగా విస్తరించేలా ప్రభుత్వంతో మాట్లాడి నిధుల మంజూరుకు కృషి చేస్తానని కోదండరామ్ తెలిపారు. సారపాకలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శ కంగా అమలయ్యేలా సహకరిస్తామని చెప్పారు. సాదాబైనామా, పోడు భూములకు పట్టాలు అందిం చాలని సంబంధిత మంత్రికి వినతిపత్రం అందిస్తా మన్నారు. ఐదు విలీన పంచాయతీలను తిరిగి భద్రా చలంలో కలిపేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడామని తెలిపారు. ఐటీసీ గుర్తింపు ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీకి మద్దతు ప్రకటించారు. ఆయన వెం ట ఐఎన్‌టీయూసీ నాయకులు మారం వెంకటేశ్‌రెడ్డి, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మూల నాగిరెడ్డి ఉన్నారు.

రామయ్యను దర్శించుకున్న ప్రొఫెసర్..

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారిని కోదండరామ్ దర్శించుకున్నారు. ఈ సంద ర్భంగా అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అధికారులు స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక అందజేశారు.

మున్సిపాలిటీని సందర్శించిన ప్రత్యేకాధికారి



విద్యాచందనకు మొక్క అందిస్తున్న సిబ్బంది

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూ డెం మున్సిపాలిటీకి ప్రత్యే కాధికారిగా నియమితులైన స్థానిక సంస్థల అదనపు కలె క్టర్ విద్యాచందన తొలిసా రిగా మంగళవారం మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సంద ర్భంగా కమిషనర్ శేషాంజన్‌స్వామి, సిబ్బంది ఆమెకు ఘనంగా స్వాగతం పలికి, సత్కరించారు. అనంతరం విద్యాచందన మాట్లాడుతూ.. జిల్లాలో ఏ గ్రేడ్ మున్సిపాలిటీ అయిన కొత్తగూడెం అభివృద్ధికి అందరూ కృషి చేయాలని సూచించారు. ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తేవాలన్నారు.

ఐటీడీఏ డీడీ విచారణ

బూర్గంపాడు: మండలంలోని ఉప్పుసాక గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో ఐటీడీఏ డీడీ మణెమ్మ మంగళవారం విచారణ చేపట్టారు. ఇటీవల తొమ్మిదో తరగతి విద్యార్థికి టీసీ ఇచ్చి పాఠశాల నుంచి పంపించిన అంశంలో క్షేత్ర స్థాయిలో సమగ్ర విచారణ చేపట్టారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడితో పాటు సంబంధిత ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. టీసీ ఇచ్చి పంపిన విద్యార్థిని తిరిగి పాఠశాలలో చేర్చుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని తెలిపారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు సమష్టిగా కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు భీమా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విస్తరిస్తున్న కుష్ఠు వ్యాధి


కుష్ఠువ్యాధి లక్షణాలు కలిగిన చేతివేళ్లు

జిల్లాలో చాపకింద నీరులా సోకుతున్న రుగ్మత

- తగిన సమయంలో చికిత్స పొందితే నయమయ్యే అవకాశం
- 'స్పర్శ' పేరుతో వైద్యారోగ్యశాఖ అవగాహన సదస్సులు

పాల్వంచరూరల్: జిల్లాలో చాపకింద నీరులా కుష్ఠు వ్యాధి విస్తరిస్తోంది. ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందే అంటు వ్యాధి కావడంతో ఆందోళనకు గురిచేస్తోంది. తగిన సమయంలో చికిత్స పొందకుంటే వ్యాధి మరింత విస్తరించే ప్రమాదం ఉంది. నిరక్షరాస్యత, అవగాహన లోపం కారణంగా కుష్ఠువ్యాధి ఎక్కువగా ప్రబలుతోందని వైద్యులు అంటున్నారు. వ్యాధి నిర్మూలన కోసం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో స్పర్శ పేరుతో గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. గత ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు ఇంటింటికీ తిరిగి సర్వే చేయడం వంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. 2017లో 40 కుష్ఠురోగులు ఉండగా, 2018లో 62 మందికి పెరిగారు. 2019లో 63 కేసులు, 2020లో 46 కేసులు, 2021లో 21 కేసులు నమోదయ్యాయి. కుష్ఠు వ్యాధి నివారణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక నిధులు కేటాయించి నివారణ చర్యలు తీసుకోవడంతో సత్ఫలితాలు కన్పిస్తున్నాయి. ఐదేళ్ల కాలంలో వ్యాధితో బాధపడుతున్న వారి సంఖ్య 342కు చేరింది. వ్యాధిపై సరైన అవగాహన లేకపోవడం, ఒక వేళ తెలిసినా బయటకు చెబితే సామాజికంగా దూరమవుతామనే భయంతో కుష్ఠువ్యాధిగ్రస్తులు కాలం గడుపుతున్నారు. అయితే, వీరు ఇతరులకు వ్యాధి సోకడానికి కారణమవుతున్నారని భావించిన ప్రభుత్వం గత ఏడాది నవంబర్‌లో 1,443 ఆశావర్కర్లు, ఏడుగురు డీపీఎంఓలు, 222 మంది ఏఎన్ఎంలు, 186 సూపర్‌వైజర్ల సాయంతో ఇంటింటి సర్వే నిర్వహించింది. 2,30,520 ఇళ్లలో 3,98,498 మందిని పరీక్షించారు. ఇందులో అనుమానాస్పదంగా 80 మందిని గుర్తించి, వైద్యపరీక్షలు నిర్వహించగా 21 మందికి వ్యాధి నిర్ధారణ చేశారు. ఈ ఏడాది సర్వే నిర్వహించలేదు.

జిల్లాలో సర్వేకు పనిచేసిన సిబ్బంది	1443
మొత్తం పరిశీలించిన ఇళ్లు	2,30,520
పరిశీలించిన వ్యక్తులు	3,98,498
అనుమానాస్పదంగా గుర్తించిన కేసులు	80
పూర్తిస్థాయిలో పరీక్షించిన కేసులు	21
జిల్లాలో కుష్ఠు నిర్ధారణ జరిగిన కేసులు	342
గతేడాది వరకు బాధితులు	62
ఐదేళ్లలో జిల్లాలోని కుష్ఠు రోగుల సంఖ్య	342

అవగాహన కార్యక్రమాలు

జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏటా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కుష్ఠు నివారణపై అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించి ప్రజలను జాగృతం చేస్తారు. అవగాహన సదస్సులు, సర్వేలు జరుపుతారు. కుష్ఠు వ్యాధి నివారణకు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. కుష్ఠువ్యాధి ముఖ్యంగా నరాలకు, చర్మానికి సోకుతుంది. వ్యాధి లక్షణాలు బహిర్గతం కావడానికి మూడేళ్లు పడుతుంది. వయస్సు, లింగ భేదం లేకుండా ఎవరికైనా సోకే అవకాశం ఉంది. వంశపారంపర్యంగా సంక్రమించదు. కుష్ఠు వ్యాధి మచ్చలు సహజపు చర్మపు రంగు కంటే తక్కువగా లేదా రాగి రంగు కలిగి ఉంటాయి. మచ్చలపై స్పర్శ, నొప్పి ఉండదు. శరీరంలో ఏప్రదేశంలోనైనా సోకవచ్చు. వ్యాధి ప్రారంభ దశలో గుర్తించి ఎంబీపీ చికిత్స జరిపితే కుష్ఠు వ్యాధి అంగవైకల్యానికి దారితీయదు. చికిత్స పూర్తయిన, చికిత్స తీసుకుంటున్న రోగుల్లో అంగవైకల్యం ఉంటే శస్త్రచికిత్స ద్వారా సరిచేయవచ్చు. వ్యాధి 6 నెలల నుంచి 12 నెలల్లో పూర్తిగా నయమవుతుంది.

సరైన సమయంలో చికిత్స తీసుకోవాలి..



కుష్ఠువ్యాధి ప్రధానంగా మైకో బ్యాక్టీరియా లెప్రీ వలన సంక్రమిస్తుంది. ఇది ఒకరి నుంచి మరొకరికి సోకుతుంది. ప్రజలకు వ్యాధి సోకి, సరైన సమయంలో చికిత్స తీసుకోకపోవడంతో తీవ్ర రూపం దాల్చుతోంది. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో కుష్ఠు వ్యాధి బాధితులు కనిపిస్తున్నారు. వ్యాధి లక్షణాలు ప్రారంభంలోనే గుర్తిస్తే వెంటనే నయం చేసుకునే అవకాశం ఉంది.

–ఎల్.భాస్కర్‌నాయక్, డీఎంహెచ్‌ఓ

దాడులు కాదు హామీలు నెరవేర్చండి..

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

చంద్రుగొండ: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని, పాలన చేతకాక ప్రశ్నించే వారిపై ఆ పార్టీ నాయకులు దాడులకు దిగుతున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు విమర్శించారు. అయన్నపాలెంలో మంగళవారం జరిగిన ఆ పార్టీ మండలస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దౌర్జన్యాలు కాదు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, కార్యకర్తలు అధైర్య పడొద్దనిన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్రస్థాయిలో వ్యతిరేకత వచ్చిందని, ఉద్యమాలు చేసి రాష్ట్రం సాధించుకున్న పార్టీకి కేసులు కొత్త కాదని పేర్కొన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రజలు మళ్లీ కేసీఆర్ పాలన కోసం పరితపిస్తున్నారని, రాబోవు రోజులు మనవేనని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో కొడకండ్ల వెంకటరెడ్డి, వగ్గెల పూజ, దార వెంకటేశ్వరరావు, నరుకుళ్ల సత్యనారాయణ, సత్తి నాగేశ్వరరావు, సూరా వెంకటేశ్వర్లు, ఎస్కే గఫార్ తదితరులు పాల్గొన్నారు.


చంద్రుగొండ: మాట్లాడుతున్న రేగా కాంతారావు

దావోస్ పర్యటన ఎందుకు?

పినపాక: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏం దాచిపెట్టడానికి దావోస్ వెళ్లారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ప్రశ్నించారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ గతంలో కేటీఆర్ దావోస్ వెళ్తే అక్రమాస్తులు దాచుకోవటానికి దావోస్ పర్యటన అని ఆరోపించిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఏం దాచుకోవటానికి వెళ్లారని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా ఒక మండలానికి ఇవ్వడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. పగడాల సతీశ్‌రెడ్డి, భద్రయ్య, గుమ్మడి గాంధీ, రవిశేఖర్‌వర్మ, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

మెకానిక్‌కు ఇన్నోవేషన్ అవార్డు

ఇల్లెందు: పట్టణానికి చెందిన బైక్ మెకానిక్ షమీ ఉల్లా కొంత కాలంగా గ్యాస్‌తో నడిచే ఇంజన్లను తయారు చేస్తున్నాడు. బైక్‌ను కూడా గ్యాస్‌తో నడిచేలా చేశారు. ఇలా ఎన్నో ఆవిష్కరణలు చేస్తున్న షమీ ఉల్లా గ్యాస్ ఆధారంగా నడిచే ఇంజన్‌లను రూపొందించి గ్రామీణ ప్రాంత రైతులకు ఉపయోగపడేలా కృషి చేస్తుండటంతో పంచాయతీ రాజ్ రూరల్ ఎంప్లాయ్‌మెంట్ శాఖ ఆయనకు ఇంటింటా ఇన్నోవేషన్ అవార్డు అందజేసింది.



షమీఉల్లా అందుకున్న అవార్డు


గ్యాస్ ఆధారంగా ఇంజన్ నడుపుతున్న షమీఉల్లా

ప్రాథమిక స్థాయిలోనే నైపుణ్యం వెలికితీయాలి

భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్

కరకగూడెం: విద్యార్థుల ప్రాథమిక స్థాయిలోనే నైపుణ్యం వెలికితీయాలని, చదువు ఒక శక్తివంతమైన ఆయుధమని భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ పిలుపునిచ్చారు. మంగళవారం పినపాక మండలంలోని మినీ గురుకులం, కరకగూడెం మండలంలోని చిరుమళ్ల ఆశ్రమ పాఠశాలలతో పాటు అరేంవారిగుంపు గిరిజన ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితిల్లోనూ పదో తరగతి విద్యార్థులను హాస్టల్ నుంచి బయటకు పంపొద్దన్నారు. గ్రాండ్ టెస్ట్ తెలుగు పరీక్ష ఫలితాల్లో పలువురు విద్యార్థులు ఫెయిల్ అవ్వడం, మరికొందరికి ఎక్కువ మార్కులు రావకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారితో సమాధానాలు బోర్డుపై రాయించారు. హాస్టల్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. చిరుమళ్ల గ్రామంలో రెండేళ్ల కోసారి జరిగే సమ్మక్క, సారలమ్మ జాతర జరిగే ప్రాంతాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా, పలు సమస్యలను చందా లింగయ్యదొర ప్రస్తావించగా స్పందించిన పీఓ మరో 10 రోజుల్లో జాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో శాశ్వతంగా మరమ్మతు పనులు చేపట్టేందుకు వీలుపడదని, తాత్కాలిక మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా పీఓను సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్, ఐటీడీఏ డీఈ మధుకర్, ఏఈ యోగేశ్, ఎంఈఓ గడ్డం మంజుల, హెచ్ఎం నాగేశ్వరరావు పాల్గొన్నారు.


అరెంవారిగుంపు పాఠశాల విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న పీఓ రాహుల్

గోదావరి జలాల సాధనకు ఉద్యమం

ఇల్లెందు: గోదావరి జలాలను ఇల్లెందు, మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాలకు సైతం అందించాలని అఖిల పక్షం నాయకులు డిమాండ్ చేశారు. ఈవిషయంలో దశలవారీగా ఉద్యమాలు చేపడుతామని తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఇల్లెందులోని సీపీఐ కార్యాలయంలో జరిగిన అఖిలపక్ష కమిటీ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, వివిధ పార్టీల నాయకులు బంధం నాగయ్య, గోపగాని శంకర్‌రావు, తాళ్లూరి కృష్ణ, క్లింట్ రోచ్, బండారి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ రోళ్లపాడులో సభ పెట్టి సీతారామ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసినా ఆతర్వాత ఇష్టానుసారంగా డిజైన్ మార్చారన్నారు. ఇల్లెందు వైపునకు బదులు అశ్వరావుపేట వైపునకు నీటిని తరలించాలనే నిర్ణయం వెనుక కుట్ర దాగి ఉందన్నారు. అంతేకాక ఇల్లెందు, మహబూబాబాద్, డోర్నకల్, వైరా ప్రాంతంలోని సన్నకారు రైతులకు ఉపయోగం లేకుండా పోతోందని తెలిపారు. ఈ విషయమై 27వ తేదీన సీఎం సలహాదారు నరేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందచేశామని చెప్పారు. ఇకపై అఖిలపక్షం ఆధ్వర్యాన ఆందోళనలు చేపడుతామని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు బాస శ్రీనివాసరావు, యాకుబ్‌షావలీ, మోహన్‌రావు, కాంతారావు, సాంబమూర్తి, అంజన్నగౌడ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నర్సయ్య

క్లుప్తంగా

డైరీ ఆవిష్కరణ


డైరీని ఆవిష్కరిస్తున్న సీఈ ప్రభాకర్‌రావు

పాల్వంచ: కేటీపీఎస్ 5, 6 దశల కర్మాగారంలో తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్-2025 డైరీ, టేబుల్ క్యాలెండర్, వాల్ క్యాలెండర్లను సీఈ ఎం.ప్రభాకర్‌రావు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఈ మాట్లాడుతూ.. ఇంజనీర్లు కష్టపడి కేటీపీఎస్ 4, 5 దశలను ఉత్పత్తిలో అగ్రభాగాన నిలబెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈలు వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, ధర్మారావు, కృష్ణ, మోక్షవీర్, డీవైసీసీ రామారావు, డి.ఉమామహేశ్వరరావు, చంద్రకళాధర్, శ్రీనివాసరావు, రాజబాబు, ప్రదీప్, దివాకర్, రామారావు, శ్రీలక్ష్మి, యాదగిరి, జయభాస్కర్, రజీన పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

టేకులపల్లి: మండలంలోని గంగారం పంచాయతీ సంపత్‌నగర్ సమీపంలో ముర్రేడు వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను వైల్డ్‌లైఫ్ ఫారెస్టు అధికారులు పట్టుకున్నారు. మంగళవారం సమాచారం మేరకు ఫారెస్టు అధికారులు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించగా.. ట్రాక్టర్ యజమానులు హుటాహుటిన ట్రాక్టర్లతో అక్కడి నుంచి పరారయ్యారు. ఒక ఇసుక ట్రాక్టర్‌ను అధికారులు పట్టుకుని విచారించగా ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకుని పాల్వంచ డివిజన్ కార్యాలయానికి తరలించినట్లు డీఆర్ఓ రామకృష్ణ తెలిపారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గ్రామస్తుల అడ్డగింత

ప్రతీ రోజు రాత్రి వేళలో ఇష్టారాజ్యంగా ఇసుక అక్రమ రవాణా జరుగుతుండగా.. ట్రాక్టర్ల మోతతో స్థానికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. అంతేకాక ముర్రేడు వాగు నుంచి యథేచ్ఛగా అక్రమ రవాణా చేస్తుండడంతో స్థానికుల అవసరాలకు ఇసుక లభించడం లేదు. దీంతో విసుగు చెందిన కిష్టారం, పాతలచ్చగూడెం గ్రామాల వారు మంగళవారం రాత్రి ఐదు ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్నారు. దీంతో ఇసుక రవాణా దారులకు, స్థానికులకు మధ్య వాగ్వాదం నెలకొంది. పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లను స్థానికులు అటవీ అధికారలకు అప్పగించారు.

తాలిపేరు వంతెన వద్ద ట్రాక్టర్ బోల్తా

చర్ల: మండలంలోని తేగడ సమీపంలో గల తాలిపేరు హైలెవెల్ వంతెన సమీపంలో మంగళవారం ఓ రైతుకు చెందిన గడ్డి ట్రాక్టర్ బోల్తా పడింది. తేగడ వైపు నుంచి గుంపన్నగూడెం వైపునకు వెళ్తున్న వరిగడ్డి ట్రాక్టర్ వంతెన పైనుంచి వెళ్తున్న క్రమంలో పలుచోట్ల ఉన్న గుంతల వల్ల గడ్డికి కట్టిన తాళ్లు ఊడి గడ్డి పక్కకు ఒరిగింది. అలాగే వచ్చిన ట్రాక్టర్ వంతెన దాటిన బోల్తాపడింది. వంతెనపై ఉన్న గుంతల వల్లనే ఈ ప్రమాదం జరిగినట్లు బాధిత రైతు తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,506

త్రిషకు అభినందనల వెల్లువ

- ప్రపంచస్థాయిలో భద్రాద్రి పేరు
- భద్రాచలంలో భారీ మోటార్ సైకిల్ ర్యాలీ

భద్రాచలంటౌన్: భద్రాచలం క్రీడాకారిణి క్రికెట్‌లో అసాధారణ ప్రతిభతో సెంచరీ చేయడంతో భద్రాద్రి పేరు ఒక్కసారిగా ప్రపంచస్థాయిలో మార్మోగిపోయింది. అండర్-19 వరల్డ్ కప్ క్రికెట్ టోర్నమెంట్‌లో పట్టణానికి చెందిన గొంగడి త్రిష మెరుపు వేగంతో సెంచరీ చేసి వరల్డ్ రికార్డు సొంతం చేసుకున్న నేపథ్యంలో పట్టణ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నెహ్రూ కప్ క్రికెట్ ఆర్గనైజర్స్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం భారీ మోటార్ సైకిల్ ర్యాలీ జరిపి త్రిషకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నెహ్రూ కప్ వ్యవస్థాపకులు తోటమల్ల బాలయోగి, సీనియర్ క్రికెటర్ బుడగం శ్రీనివాస్, కొండరెడ్ల సంఘం వ్యవస్థాపకులు ముర్ల రమేశ్, ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బందు వెంకటేశ్వరరావు, ఎస్కే సలీం, సదానందం, పూనెం ప్రదీప్‌కుమార్, రేపాక రామారావు, నరేశ్, కోటేశ్వరరావు, రామకృష్ణారెడ్డి, బలుసు సతీశ్, రమేశ్, ఆనంద్ పాల్, ప్రవీణ్, ప్రసాద్, శ్రీనివాస్, మురళి పాల్గొన్నారు.


పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రీడాకారులు, క్రీడాభిమానులు

కిచెన్‌షెడ్‌లోనే విద్యాబోధన

జూలూరుపాడు: మండలంలోని భేతాళపాడు గ్రామ పంచాయతీ గొల్లగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలోని కిచెన్ షెడ్‌లో అంగన్‌వాడీ చిన్నారులకు విద్యాబోధన చేస్తున్నారు. గొల్లగూడెం అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేకపోవడంతో కిచెన్ షెడ్‌లో చిన్నారులను కూర్చోబెట్టి బోధించాల్సి వస్తోంది. 2010లో గొల్లగూడెం ప్రభుత్వ పాఠశాలలో మినీ అంగన్‌వాడీ కేంద్రాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. రెండేళ్లు చెట్ల కింద చిన్నారులను కూర్చోబెట్టారు. 2012-2013 నుంచి పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తయారు చేసేందుకు నిర్మించిన కిచెన్ షెడ్‌లో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. పాఠాలు చెప్పడానికి, వంట చేసేందుకు అనువుగా లేకపోయినప్పటికీ ఇక్కడే బోధించాల్సి వస్తోందని అంగన్‌వాడీ టీచర్ పూనెం మణి తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనం మంజూరు చేయాలని అంగన్‌వాడీ టీచర్ కోరారు.


కిచెన్‌షెడ్‌లో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

పేకాటస్థావరంపై దాడి

చంద్రుగొండ: మండలంలోని తిప్పనపల్లి శివారులో మంగళవారం పేకాట శిబిరంపై ఎస్ఐ శివరామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. నలుగురు వ్యక్తులను అదుపులో తీసుకుని, వారి వద్ద నుంచి రూ.5,160 నగదు, మూడు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తల్లిని చంపిన తనయుడు

- అనుమానాస్పద మృతి కేసును ఛేదించిన పోలీసులు

సుజాతనగర్: మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటనలో తనయుడే తల్లిని చంపినట్లుగా తేలింది. ఎస్సై ఎం.రమాదేవి తెలిపిన వివరాల ప్రకారం.. నిమ్మలగూడెం గ్రామానికి చెందిన బండి సుజాత (40) ఈ నెల 25వ తేదీ తెల్లవారుజామున మృతి చెందింది. మృతురాలి అన్న సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతురాలి కుమారుడు బండి పవన్ తన తల్లి సుజాతను తాడుతో మెడ చుట్టూ బిగించి చంపాడని పోలీసుల విచారణలో తేలింది. ఇదే గ్రామానికి చెందిన మరో వ్యక్తితో వివాహేతర సంబంధం ఉందనే కారణంతో తల్లిని చంపినట్లు నిందితుడు పోలీసుల ఎదుట అంగీకరించాడు. ఈ మేరకు చుంచుపల్లి సీఐ రాయల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్

కోదాడరూరల్: గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను సూర్యాపేట జిల్లా మోతె పోలీసులు అరెస్ట్ చేశారు. కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి మంగళవారం తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఏపీలోని తూర్పుగోదావరి జిల్లాకు చెందిన బుర్రం సాయికుమార్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని అల్లూరి సీతారామరాజుకాలనీకి చెందిన గుండి మురళీకృష్ణ, రాజుపేట కాలనీకి చెందిన బానోత్ ఫణికుమార్ కలిసి భద్రాద్రి జిల్లా సరిహద్దు డొంకరాయిలో 9.3 కేజీల గంజాయిని కేజీ రూ.2,500 చొప్పున కొనుగోలు చేశారు. అనంతరం ఎక్కువ ధరకు విక్రయించేందుకు స్కూటీపై ఖమ్మం మీదుగా హైదరాబాద్‌కు బయల్దేరారు. మోతె మండలం మామిళ్లగూడెం శివారులోని టోల్‌ప్లాజా వద్ద మోతె ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి, సిబ్బంది చేపట్టిన తనిఖీల్లో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 9 కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు, స్కూటీని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, మోతె ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి, సిబ్బంది శ్రీనివాస్, సతీశ్‌నాయుడు, ఎల్లారెడ్డి, బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆటోమొబైల్స్ దుకాణాదారుడిపై కేసు

అశ్వారావుపేటరూరల్: బాలకార్మికుడితో పనులు చేయిస్తున్న ఓ ఆటోమొబైల్స్ దుకాణాదారుడిపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ యయాతిరాజు కథనం ప్రకారం.. మండలంలోని వినాయకపురంలో 'ఆపరేషన్ ముస్కాన్'అధికారుల ఆధ్వర్యంలో పలు దుకాణాల్లో తనిఖీలు చేపట్టగా స్థానిక ఆటోమొబైల్స్‌లో పదిహేనేళ్ల బాల కార్మికుడితో పనులు చేయిస్తున్నట్లు గుర్తించారు. అనంతరం యజమాని శివరాతి వెంకన్నబాబుపై ఫిర్యాదు అందటంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. బాలకార్మికుడి తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చామని ఆయన పేర్కొన్నారు.

ఇరు వర్గాలపై..

పాల్వంచ: భూ తగాదాలో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడటంతో పోలీసులు కేసులు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలో శ్రీనివాసకాలనీలో ఓ భూమి విషయమై ఇరు వర్గాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. సోమవారం రెండువర్గాల వారు ఘర్షణ పడి కర్రలతో పరస్పర దాడులకు దిగారు. ఎస్ఐ సుమన్ చిటికెన ముసలయ్య, కందుకూరి రామకృష్ణ, అనుచరులపై.. సముద్రాల సైదులు వర్గంపై బుధవారం కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.